
సాక్షి
ఆదిలాబాద్

మంగళవారం। 5। మార్చి। 2024



ప్రసంగిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, చిత్రంలో ఎంపీలు కిషన్‌రెడ్డి, సంజయ్, బాపూరావు, ఎమ్మెల్యేలు శంకర్, మహేశ్వర్‌రెడ్డి, హరీశ్‌బాబు



ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ



సభకు హాజరైన జనం

మోదీ, యోగి చిత్రాలను ఛాతిపై టాటు వేసుకున్న యువకుడు

బామ్మ జోష్

కమలం.. సమరోత్సాహం

- పార్లమెంట్ ఎన్నికలకు బీజేపీ శంఖారావం
- మోదీ సభ సక్సెస్‌తో విజయంపై ధీమా
- అధికారిక ప్రోగ్రాంలో ప్రధానితో వేదిక పంచుకున్న గవర్నర్, సీఎం
- కాషాయ శ్రేణుల్లో జోష్ నింపిన పీఎం ఆదిలాబాద్ టూర్

సాక్షి,ఆదిలాబాద్/కైలాస్‌నగర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదిలాబాద్ పర్యటన కమలం పార్టీ శ్రేణుల్లో సమరోత్సాహాన్ని నింపింది. పార్లమెంట్ ఎన్నికలకు సన్నాహకంగా ఇప్పటికే బీజేపీ విజయ సంకల్ప యాత్ర తలపెట్టి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పూర్తిచేసింది.తాజాగా ప్రధాని మోదీ లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి తెలంగాణలో తెరలేపారు. ఆదిలాబాద్ నుంచి సోమవారం శంఖారావం పూరించారు. సభ సక్సెస్‌తో రాష్ట్రంలోని అన్ని స్థానాల్లోనూ విజయం సాధిస్తామనే ధీమా ఆ పార్టీ నేతల్లో కనిపిస్తోంది. తనప్రసంగంతో మోదీఆకట్టుకోగా.. ఆయా అంశాలపై ప్రజలు ఉత్సాహంగా స్పందించారు.

అధికారిక కార్యక్రమం, సభ..

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధానమంత్రి మోదీ సోమవారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. నాగ్‌పూర్ నుంచి హెలికాప్టర్ ద్వారా ఉదయం 11.40 గంటలకు జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. స్థానిక విమానాశ్రయ మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగారు. పార్టీ శ్రేణులు, అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ప్రధాని రోడ్డు మార్గంలో ఇందిరా ప్రియదర్శిని స్టేడియానికి చేరుకున్నారు. ఇక్కడ రెండు వేదికలు ఏర్పాటు చేయగా, మొదటి వేదికలో ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్ మోదీతో వేదిక పంచుకున్నారు. దేశానికి సంబంధించి రూ.56వేల కోట్ల అభివృద్ధి పనులు ఉండగా, అందులో రాష్ట్రానికి సంబంధించి రూ.6,697 కోట్ల విలువైన ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేసి జాతికి అంకితం చేశారు. ఇక్కడ ప్రధాని కంటే ముందు రేవంత్ రెడ్డి, కిషన్‌రెడ్డి ప్రసంగించారు. దాదాపు అరగంట పాటు ఈ కార్యక్రమం సాగింది. అనంతరం గవర్నర్, సీఎం వెనుదిరగగా.. బహిరంగ సభ జరిగే రెండో వేదికపైకి మోదీ చేరుకున్నారు. ప్రధాని రాక ముందు పలువురు బీజేపీ నాయకులు ప్రసంగించగా, వచ్చిన తర్వాత మొదట ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు, ఆ తర్వాత ఎమ్మెల్యే పాయల్ శంకర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రసంగించారు. తర్వాత మోదీ ప్రసంగం సుమారు 20 నిమిషాల పాటు సాగింది. తెలంగాణ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని చెబుతూ ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. అనంతరం సభ ముగిసింది. ప్రధాని బయల్దేరి వెళ్లారు. మొత్తంగా ప్రధాని జిల్లాలో దాదాపు రెండు గంటల పాటు గడిపారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, కేంద్ర మాజీ మంత్రి హన్సరాజ్ గంగారాం అహిర్, బీజేఎల్‌పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు పాల్వాయి హరీశ్‌బాబు, రామారావు పటేల్, జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్, సీనియర్ నాయకులు అయ్యన్నగారి భూమయ్య, మాజీ ఎమ్మెల్యే సుమన్ రాథోడ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, పార్లమెంట్ ప్రభారి అల్జాపుర్ శ్రీనివాస్, మంచిర్యాల ఇన్‌చార్జి రఘునాథ్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రధాని మోదీని శాలువాతో సత్కరిస్తున్న నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి



ప్రధానికి వేంకటేశ్వరస్వామి ప్రతిమ అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

వీఐపీల తాకిడి.. హెలికాప్టర్ల సందడి

వీఐపీల రాకతో ఆదిలాబాద్‌లో సందడి నెలకొంది. గగనతలంలో హెలికాప్టర్ల సందడి జనాన్ని కనువిందు చేసింది. ప్రధాని మోదీకి ప్రొటోకాల్ ప్రకారం స్వాగతం పలికేందుకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విచ్చేశారు. ప్రధాని ప్రయాణించిన హెలికాప్టర్‌తో పాటు మరో రెండు హెలికాప్టర్లు కూడా ఆయన వెంట వచ్చాయి. గవర్నర్, సీఎం వేర్వేరు హెలికాప్టర్లలో జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మరో హెలికాప్టర్‌లో వచ్చారు. మొత్తంగా ఆరు హెలికాప్టర్లు ఉదయం గగనతలంలో విహరించాయి. ఆ చప్పుడు విన్నప్పుడు సభ ప్రాంగణానికి అప్పటికే విచ్చేసిన జనం కేరింతలు కొట్టారు. మొత్తంగా వీవీఐపీలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఎస్పీ గౌస్ ఆలం, ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో స్వాగతించారు. కాగా, సభకు పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. కార్యక్రమం ముగిసిన తర్వాత స్థానిక కలెక్టరేట్ రోడ్డు, హౌసింగ్ బోర్డు వైపు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్ రద్దీ కనిపించింది.

ప్రధానితో 'సోయం' ముచ్చట



ఎంపీ సోయంతో ముచ్చటిస్తున్న మోదీ

సభలో ప్రధాని మోదీతో ఎంపీ సోయం బాపూరావు ముచ్చటించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను బీజేపీ అధిష్టానం ఈనెల 2న ప్రకటించగా అందులో 'సోయం'కు చోటు దక్కలేదు. దీంతో ఈ సారి ఆయన్ను మార్చుతున్నారనే ప్రచారం నేపథ్యంలో మోదీతో ముచ్చటించడం సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఎంపీ సీటు గురించే మాట్లాడారా.. జిల్లాకు సంబంధించిన ప్రాజెక్టుల మంజూరుపై చర్చించి ఉంటారా అనే చర్చ సాగుతోంది. దీనిపై ఎంపీ 'సోయం'ను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా అలా ఎలా చెబుతారని పేర్కొనడం గమనార్హం.

జిల్లా అభివృద్ధికి సహకరించాలి



ఆదిలాబాద్ జిల్లాకు గత 40 ఏళ్లలో ప్రధానమంత్రి హోదాలో ఏ నాయకుడు రాలేదు. మనందరి అభిమాన నాయకుడు ప్రధాని మోదీ ఆదివాసీలు, వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాలో పాదం మోపడమంటే ఈ ప్రాంతమంతా సస్యశ్యామలమైనట్టే. జిల్లా ప్రజలు దశాబ్దాల తరబడి ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ కోసం ఎదురుచూస్తున్నారు. వెనుకబడిన ఈ జిల్లాకు రైలు సౌకర్యం కల్పించేలా ఈ లైన్‌ను మంజూరు చేయాలి. అలాగే రాష్ట్రంలో ఆదిలాబాద్ మినహా ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏదో ఒక యూనివర్సిటీ ఉంది. ఈ ప్రాంత పరిధిలోనూ యూనివర్సిటీని మంజూరు చేసి జిల్లా అభివృద్ధికి సహకరించాలి.

– సోయం బాపూరావు, ఎంపీ, ఆదిలాబాద్

సీసీఐని పునరుద్ధరించాలి



ఆదిలాబాద్‌లో మూతపడ్డ సీసీఐ పరిశ్రమను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలి. 5వేల మందికి తిరిగి ఉపాధి కల్పించాలి. పరిశ్రమను తెరిపిస్తే వెనుకబడ్డ ఆదిలాబాద్ ప్రాంతం అభివృద్ధి చెందే అవకాశముంటుంది. అలాగే ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ రైల్వేలైన్ మంజూరు చేయడంతో పాటు జిల్లా కేంద్రంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి చర్యలు తీసుకుని ఈ ప్రాంతాభివృద్ధికి కృషి చేయాలి. జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యమందించేలా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించిన ప్రధాని నరేంద్రమోదీకి జిల్లా ప్రజల పక్షాన ధన్యవాదాలు.

– పాయల్ శంకర్, ఎమ్మెల్యే, ఆదిలాబాద్

ప్రాణహిత ప్రాజెక్ట్ పూర్తి చేయాలి



తూర్పు ప్రాంతంలోని ప్రాణహిత ప్రాజెక్ట్ 15 ఏళ్లుగా పెండింగ్‌లో ఉంది. ఈ ప్రాజెక్ట్‌ను త్వరగా పూర్తి చేసి అక్కడి భూములను సస్యశ్యామలంగా మార్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మోదీని మూడోసారి ప్రధానిగా చేయాల్సిన అవసరం ఎంతో ఉంది. ఇందుకోసం తెలంగాణలో మెజార్టీ సీట్లు గెలవాలి. ఆదిలాబాద్ ఎంపీ స్థానాన్ని తప్పకుండా కైవసం చేసుకుంటాం. ఇప్పటికే బీఆర్ఎస్ కాలగర్భంలో కలిసిపోయింది. ఆ పార్టీకి అభ్యర్థులే దొరకడం లేదు. అధికారంలోకి వచ్చే అవకాశమే లేని కాంగ్రెస్‌ను గెలిపిస్తే ప్రయోజనం ఉండదు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎనిమిది మంది ఎమ్మెల్యేలం రాష్ట్రానికి ఎనిమిది దిక్కుల్లా నిలిచి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాం.

– పాల్వాయి హరీశ్‌బాబు, ఎమ్మెల్యే, సిర్పూర్

హైదరాబాద్ ఎంపీ సీటునూ గెలుస్తాం



బీజేపీ గెలుపుకోసం ప్రజలు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. గత పదేళ్లలో ప్రధాని మోదీ.. అభివృద్ధి, సంక్షేమపరంగా దేశ రూపురేఖలనే మార్చారు. అలాంటి మోదీ ఆదిలాబాద్ నుంచే విజయపరంపర సాగించేలా ప్రజల ఆశీర్వాదం కోసం వచ్చారు. మోదీ హయంలో ఎంతో భద్రత ఉందని, రానున్న ఎన్నికల్లో 400ఎంపీ స్థానాలను పార్టీ గెలువాలని ప్రజలు కోరుకుంటున్నారు. దేశానికి, బీజేపీకి మోదీయే శ్రీరామరక్ష. బీఆర్ఎస్ మునిగిపోగా, కాంగ్రెస్‌కు గెలుపుపై నమ్మకం లేదు. ఈసారి హైదరాబాద్ ఎంపీ స్థానాన్ని కూడా బీజేపీ గెలుచుకోవడం ఖాయం. ఆర్టికల్ 370ని రద్దుచేశాక ప్రజలంతా మోదీని తమ కుటుంబ సభ్యులుగా భావిస్తున్నారు.

– అల్జాపూర్ శ్రీనివాస్, పార్లమెంట్ ప్రభారీ



గవర్నర్ తమిళిసైకి స్వాగతం పలుకుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

గవర్నర్, సీఎంకు ఘన స్వాగతం

కైలాస్‌నగర్: ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ఆదిలాబాద్ విచ్చేశారు. ఏరోడ్రోంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద వీరికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఎస్పీ గౌస్ ఆలం పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అలాగే అధికారిక కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా తదితరులు పాల్గొన్నారు.



అధికారిక కార్యక్రమంలో పాల్గొన్న సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా

ఇంటర్ పరీక్షలకు 695 మంది గైర్హాజరు

కైలాస్‌నగర్: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు సోమవారం కొనసాగాయి. మ్యాథమెటిక్స్, బోటనీ, పొలిటికల్ సైన్స్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 10,519 విద్యార్థులకు గాను 9,824 మంది హాజరయ్యారు. 695 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో రవీందర్ కుమార్ తెలిపారు.

రైల్వేస్టేషన్ తనిఖీ చేసిన రైల్వే జీఎం

కైలాస్‌నగర్: సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ సోమవారం ఆదిలాబాద్ రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ పరిసరాలతో పాటు రైల్వే ట్రాక్‌ను పరిశీలించారు. అక్కడి సమస్యలపై ఆరా తీశారు. కాగా సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సభ్యులు ఆయనను కలిశారు. ఉద్యోగులు తమ సమస్యలను జీఎం దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక రైల్వే క్వార్టర్స్‌లో నీటి సమస్యను పరిష్కరించాలని, అదనపు క్వార్టర్స్ నిర్మించాలని కోరారు. అలాగే రైల్వే ఇనిస్టిట్యూట్ స్థాపించాలని విన్నవించారు.



రైల్వే జీఎంకు సమస్యలను వివరిస్తున్న ఉద్యోగులు

అంగన్‌వాడీ ఉద్యోగాలు..

- ఖాళీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం కసరత్తు
- ఇక ఇంటర్మీడియెట్ విద్యార్హత
- జిల్లాలో 231 పోస్టులు భర్తీ అయ్యే అవకాశం



చిన్నారులకు బోధిస్తున్న అంగన్‌వాడీ టీచర్

కైలాస్‌నగర్: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలందించాల్సిన అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులను ఇక నుంచి ఇంటర్మీడియెట్ విద్యార్హతతో భర్తీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులను త్వరలోనే భర్తీ చేసేందుకు యోచిస్తుంది. ఇప్పటికే జిల్లాల వారీగా ఉన్న ఖాళీల వివరాలు సేకరించిన ప్రభుత్వం త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేసేందుకు సిద్ధమవుతుంది. ప్రస్తుతమున్న ఖాళీల ప్రకారం ఆదిలాబాద్ జిల్లాలో 231 పోస్టులు భర్తీ అయ్యే అవకాశముంది. దీనికనుగుణంగా ఆ శాఖ జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు. పోస్టుల భర్తీ జరిగినట్లైతే జిల్లాలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం మరింత పకడ్బందీగా అందే అవకాశముంటుంది.

ఖాళీ పోస్టులు 231

జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐదు ప్రాజెక్టులున్నాయి. వీటి పరిధిలో మొత్తం 1,256 అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి. ఇందులో 992 మెయిన్, 264 మినీ కేంద్రాలుగా ఉన్నాయి.

- అంగన్‌వాడీ టీచర్ పోస్టులు 992 మంజూరు ఉండగా ప్రస్తుతం 932 మంది సేవలందిస్తున్నారు. 60 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- అలాగే మినీ కేంద్రాల్లో 264 పోస్టులకు గాను 229 మంది పనిచేస్తున్నారు. 35 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- ఇక ఆయా పోస్టులు 992 మంజూరు ఉండగా ప్రస్తుతం 856 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 136 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- మినీ, మెయిన్ అంగన్‌వాడీలు కలిపి 95 టీచర్ పోస్టులు, 136 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ వివరాలతో కూడిన ప్రతిపాదనలను ఐసీడీఎస్ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఖాళీగా ఉన్న పోస్టులను ఇంటర్మీడియెట్ విద్యార్హతతో భర్తీకి ప్రభుత్వం త్వరలో నోటిఫికేషన్ విడుదల చేసినట్లైతే ఇవి భర్తీ అయ్యే అవకాశముంటుంది. తద్వారా ఆయా కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే సేవలు మెరుగుపడే అవకాశముంటుంది.

త్వరలో మినీ అంగన్‌వాడీల అప్‌గ్రేడ్

జిల్లాలోని 264 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు త్వరలోనే ప్రధాన కేంద్రాలుగా అప్‌గ్రేడ్ కానున్నాయి. మినీ కేంద్రాలు కేవలం అంగన్‌వాడీ టీచర్‌తోనే నిర్వహిస్తారు. వీరికి ఆయాల వేతనం మాత్రమే చెల్లిస్తారు. ఇలాంటి కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రతిపాదలను సిద్ధం చేసిన ఐసీడీఎస్ అధికారులు ఆ వివరాలను కలెక్టర్ ఆమోదం కోసం పంపించారు. అనుమతి లభించిన వెంటనే అవి ప్రధాన కేంద్రాలుగా సేవలు అందించనున్నాయి. అప్‌గ్రేడ్ చేసినట్లైతే ఈ కేంద్రాల్లో ఆయా పోస్టుల భర్తీకి అవకాశం ఏర్పడనుంది. ఫలితంగా మరో 264 ఆయా పోస్టులు కొత్తగా మంజూరయ్యే ఛాన్స్ ఉంటుంది. ఈ కేంద్రాల్లో పనిచేసే అంగన్‌వాడీ టీచర్ల వేతనాలు కూడా పెరిగే అవకాశముంటుంది.

ప్రాజెక్టుల వారీగా అంగన్‌వాడీలు, ఆయాల ఖాళీల వివరాలు

ప్రాజెక్ట్ పేరు	అంగన్ వాడీలు	మినీఅంగన్ వాడీలు	ఆయాలు
ఆదిలాబాద్‌అర్బన్	14	12	44
బోథ్	14	04	25
జైనథ్	13	01	24
నార్నూర్	07	09	16
ఉట్నూర్	12	09	27

ప్రభుత్వానికి ప్రతిపాదించాం

జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయా పోస్టుల వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. ఇక నుంచి ఇంటర్మీడియెట్ విద్యార్హత ఆధారంగానే ఈ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. త్వరలోనే నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశముంది. అలాగే మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు కలెక్టర్‌కు ప్రతిపాదించాం. త్వరలోనే వాటికి అనుమతి వచ్చే అవకాశముంది.

– సబిత, ఐసీడీఎస్ పీడీ, ఆదిలాబాద్

క్లుప్తంగా

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన శ్రీకాంత్‌రెడ్డి



సీఎంకు స్వాగతం పలుకుతున్న శ్రీకాంత్‌రెడ్డి

కైలాస్‌నగర్: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొ రంచు శ్రీకాంత్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలో ప్రధాని మోడీతో కలి సి అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు హాజరైన సీఎంను మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేష్ , ఏఐసీసీ సభ్యులు నరేష్ జాదవ్, బోథ్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, అనిల్‌కుమార్‌లతో కలిసి సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

పెరిగిన ధరలకు అనుగుణంగా సవరించాలి

ఎదులాపురం: 73 షెడ్యూల్ పరిశ్రమల్లో కనీస వేతనాల జీవోలను పెరిగిన ధరలకు అనుగుణంగా సవరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న అన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆది, సోమవారం నిర్వహించిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పరిశ్రమల్లో కనీస వేతనాల జీవోలను పెరిగిన ధరలకు అనుగుణంగా సవరించాలని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం 73 షెడ్యూల్డ్ పరిశ్రమల్లో పనిచేస్తున్న సుమారు 1.20 కోట్ల మంది కార్మికుల కనీస వేతనాల సవరణ చేసి అతి తక్కువగా కనీస వేతనాలు నిర్ణయించిందని పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో పెట్టుబడిదారులకు, పారిశ్రామిక యాజమాన్యాలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ కనీస వేతనాల నిర్ణయాన్ని పునః సమీక్షించి పెరిగిన ధరల ప్రకారం నిర్ణయించాలని రాష్ట్ర కౌన్సిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. ఇందులో జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి

ఉట్నూర్‌రూరల్: గిరిజన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని డీడీ దిలీప్‌కుమార్ అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గుడిహత్నూర్ మండలం గుర్జా గ్రామానికి చెందిన లక్ష్మి తనకు పట్టా ఇప్పించాలని, బేల మండలం రైపూర్ గ్రామానికి చెందిన మాడవి మొత్తిబాయి కుట్టుమిషన్ మంజూరు చేయాలని కోరారు. ఉట్నూర్ మండలం లక్కారం గ్రామానికి చెందిన సాయికిరణ్ ఈఎంఆర్‌ఎస్‌లో అడ్మిషన్ కోసం, వాంకిడి మండలం స్వాతి కొలాంగూడకు చెందిన భీంరావు బోర్‌వేల్ మంజూరు చేయాలని కోరారు. ప్రజావాణిలో ఏపీవో కనక భీంరావు, ఏడీఎం అండ్ హెచ్‌వో కుమ్ర బాలు, ఏవో రాంబాబు, ఏపీవో భాస్కర్ పాల్గొన్నారు.

వీరాంజనేయ ఎస్‌హెచ్‌జీకి జాతీయ స్థాయి పురస్కారం

కైలాస్‌నగర్: బ్యాంక్ రుణాలు సద్వినియోగం చేసుకుని వ్యాపారవేత్తగా ఎదిగిన ఆదిలాబాద్ పట్టణం ఇందిరానగర్ కాలనీకి చెందిన వీరాంజనేయ స్వయం సహాయక సంఘం (ఎస్‌హెచ్‌జీ)కు జాతీయ స్థాయి పురస్కారం లభించింది. ఆహార ఉత్పత్తులు తయారు చేస్తూ రాణిస్తున్న సంఘం సభ్యురాలు విజయలక్ష్మి ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. రాష్ట్రం నుంచి 56 ప్రతిపాదనలు పంపగా, విజయలక్ష్మిని ఎంపిక చేస్తూ కేంద్ర హౌజింగ్ అర్బన్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆరుగురికి పురస్కారాలు ప్రకటించగా, అందులో రాష్ట్రం నుంచి వీరాంజనేయ మహిళ సంఘం ఎంపికైంది. ఈ నెల 26న ఢిల్లీలోని గురుగాంలో జరిగే కార్యక్రమంలో సభ్యురాలు విజయలక్ష్మితోపాటు కమిషనర్ ఎండీ.ఖమర్ అహ్మద్, మెప్మా డీఎంసీ శ్రీనివాస్ అవార్డు అందుకోనున్నారు.



మోదీ ప్రసంగాన్ని సెల్‌ఫోన్‌లో బంధిస్తున్న మహిళ



రాష్ట్ర నాయకులు, ఎమ్మెల్యేలకు నమస్కరిస్తున్న ప్రధాని



బండి సంజయ్‌తో.. నిర్మల్, సిర్పూర్ ఎమ్మెల్యేలు

మోదీ రాకతో మస్తు జోష్!

ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం ఆదిలాబాద్‌లో పర్యటించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి స్వాగతం పలికారు. ఇక సభకు భారీగా జనం తరలివచ్చారు. దీంతో పార్టీ శ్రేణుల్లో జోష్ కనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



మోదీ సభకు వస్తున్న ప్రజలు, కార్యకర్తలు



బీజేపీ జెండాతో మహిళలు



పోలీసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్



వీవీపీ గ్యాలరీ వద్ద క్యూ



మోదీ ప్రసంగానికి చప్పట్లు కొడుతున్న మహిళలు

ప్రధాని సభ సైడ్‌లైట్స్

కైలాస్‌నగర్: విజయ సంకల్పయాత్రలో భాగంగా సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించి న బహిరంగసభకు ప్రధానీ నరేంద్రమోడీ హాజరయ్యారు. సభ విజయవంతం కావడంతో బీజేపీ శ్రేణుల్లో నూతన ఉత్తేజం నిండుకుంది.

- ఉదయం 10.20 గంటలకు ప్రధాని నరేంద్రమోడీ ఆదిలాబాద్‌కు రావాల్సి ఉండగా ఉదయం 11.40 గంటలకు హాజరయ్యారు. మధ్యాహ్నం 12.14 నిమిషాలకు బహిరంగ సభ వేదికపైకి చేరుకున్నారు.
- ప్రధానికి స్వాగతం పలికేందుకు జిల్లా కేంద్రానికి ఉదయం9.30గంటలకే చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్ తమిళి సై ప్రధాని జిల్లాకు చేరుకున్న సమయంలో హెలిప్యాడ్ వద్ద అందుబాటులో లేరు. అధికారిక కార్యక్రమాల వేదిక వద్దకు చేరుకున్నాకే మోడీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.
- సభ వేదికపై మోడీకి ఓ వైపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మరోవైపు సోయం బాపూరావులు కూర్చున్నారు. ప్రధానితో సోయం మాట్లాడటాన్ని సభికులు ఆసక్తిగా గమనించారు.
- కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సభవేదికపైకి రాగా సీఎంసీఎం అంటూ నినాదాలు చేశారు.
- ప్రసంగంలో నాలుగు వందలు, మోడీ గ్యారెంటీ అంటూ తెలుగులో మాట్లాడడంతో చప్పట్లతో మద్దతు తెలిపారు.
- మోడీ ప్రసంగ సమయంలో దేశ రక్షణ, అభివృద్ధిని ప్రస్తావించిన సమయంలో వేదికపై ఉన్న ముఖ్య నాయకులంతా నిలబడి చప్పట్లు కొట్టారు.
- మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ ప్రసంగాన్ని మొదలు పెట్టేందుకు రాగా ప్రధాని వేదికపైకి చేరుకోవడంతో ప్రసంగాన్ని ప్రారంభించలేదు.

ట్రిపుల్‌ఐటీ అధ్యాపకులకు శిక్షణ



శిక్షణలో అధ్యాపకులు

భైంసా: హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో సోమవారం బాసర ట్రిపుల్‌ఐటీ అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. అకాడమిక్ లీడర్ షిప్‌పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం కొనసాగనుంది. ఈ కార్యక్రమాన్ని డైరెక్టర్ జనరల్ ఎన్‌సీహెచ్‌ఆర్‌డీ డా. శశాంక్‌గోయెల్ ఐఏఎస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సాంకేతికంగా వస్తున్న మార్పులు చేర్పులపై అధ్యాపకులకు అవగాహన పెంచుకోవడానికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇంజినీరింగ్ నిపుణులు ప్రజల రోజువారి ఉపయోగం కోసం నూతన సాంకేతికత, సాంకేతిక పరికరాలను రూపొందించడానికి అవకాశాలు కల్పించే విధంగా నైపుణ్యాలు సాధించాలన్నారు. ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ చదువుతున్న సమయంలో నేర్పించేస్థాయికి అధ్యాపకులు చేరుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. అనంతరం క్షేత్రపర్యటనలో భాగంగా ట్రిపుల్‌ఐటీ అధ్యాపకులు హైదరాబాద్‌లో టీహబ్, టీవర్క్స్‌ను వీక్షించారు. అందిస్తున్న సేవల గురించి తెలుసుకున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పత్తి దగ్ధం

- రూ.4.20 లక్షల నష్టం



పత్తిపంటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావ్ పటేల్

తానూరు: మండలంలోని ఉమ్రి(కే) గ్రామానికి చెందిన కధం గంగాధర్ పటేల్ అనే రైతుకు చెందిన వ్యవసాయ పనిముట్లు, పత్తి ఆదివారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధిత రైతు వివరాల ప్రకారం... గంగాధర్ పటేల్ తన వ్యవసాయ పొలంలోని రేకుల షెడ్డులో వ్యవసాయ పనిముట్లతో పాటు, 90 క్వింటాళ్ల వరకూ పత్తిని నిల్వచేశాడు. ఆదివారం రాత్రి షెడ్డులో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి పత్తికి మంటలు వ్యాపించాయి. అక్కడే పడుకుని ఉన్న రైతు గంగాధర్ పటేల్ పరిశీలించి కటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. అప్పటికే 50 క్వింటాళ్ల వరకు పత్తితో పాటు వ్యవసాయ పనిముట్లు దగ్ధమయ్యాయి. సోమవారం రెవెన్యూ ఆర్ఐ మోహన్‌సింగ్ అక్కడికి చేరుకుని కాలిపోయిన వ్యవసాయ పనిముట్లు, పత్తిని పరిశీలించి పంచనామా నిర్వహించారు. ఈ ప్రమాదంలో మొత్తం రూ.4.20 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని ఆర్ఐ మోహన్‌సింగ్ తెలిపారు. తమకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేవిధంగా చూడాలని బాధిత రైతు గంగాధర్ పటేల్ వేడుకుంటున్నాడు.

పరిహారం అందేవిధంగా చూస్తాం ..

ఉమ్రి(కే) గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన పత్తిని సోమవారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు నారాయణ్‌రావ్ పటేల్ పరిశీలించారు. బాధిత రైతు గంగాధర్ పటేల్‌ను ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి రైతు కధం గంగాధర్‌కు పరిహారం అందే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట నాయకులు మధుపటేల్, కోఆప్షన్ సభ్యుడు గోవింద్‌రావ్ పటేల్, మాజీ సర్పంచ్‌లు రాందాస్, మారోతి, మాజీ కోఆప్షన్ సభ్యుడు చంద్రకాంత్ యాదవ్ ఉన్నారు.

చదువు ధ్యాసలో 'చూపు' పైలం...

- పరీక్షల వేళ నేత్రాలపై ఒత్తిడి పెంచొద్దు
- తగిన జాగ్రత్తలు అవసరమంటున్న నేత్రవైద్య నిపుణులు



డాక్టర్ దీప్తి



పరీక్షలకు సంసిద్ధమవుతున్న పదోతరగతి విద్యార్థులు

నిర్మల్‌ఖిల్లా: రానున్న ఈ మూడు నెలలు పరీక్షల కాలం. ఇప్పటికే ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఈ నెల 18 నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు పోటీపడి గంటల తరబడి చదువుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో రాత్రి వరకు కూడా అదనపు తరగతులు, స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. వీటితో పాటు ప్రభుత్వం వివిధ విభాగాల్లో ఉద్యోగ ప్రకటనలు సైతం వెలువడుతున్న నేపథ్యంలో యువత పోటీ పరీక్షలకు అధిక సంఖ్యలో సన్నద్ధమవుతున్నారు. గ్రంథాలయ గదుల్లో పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ప్రతిరోజు గంటల తరబడి చదవడంతో కళ్లపై భారం పడడంతో పాటు దృష్టిలోపాలు తలెత్తే ప్రమాదం ఉంటుందని నేత్ర వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. తగిన జాగ్రత్తలు పాటిస్తేనే కంటి చూపునకు ఇబ్బంది ఉండదని సూచిస్తున్నారు. పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు, యువత కోసం జిల్లా కేంద్రంలోని ప్రముఖ నేత్ర వైద్య నిపుణురాలు డాక్టర్ దీప్తి అందిస్తున్న సూచనలు ఈ కింది విధంగా ఉన్నాయి..

- పరీక్షల సమయంలో గంటల తరబడి చదవాల్సి వస్తే అభ్యర్థులు తరచూ కంటి రెప్పలు మూస్తూ తెరుస్తూ ఉండాలి. తద్వారా అలసట నివారణతో పాటు కళ్లకు ఉపశమనం కలుగుతుంది. కంటి దురద దరిచేరదు.
- పరీక్షల సమయంలో కళ్లపై తీవ్రంగా ఒత్తిడి పడకుండా ప్రిపరేషన్ సమయంలో మధ్య మధ్యలో కాసేపు నిద్రపోవాలి. తీసుకునే ఆహారంలో కూడా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, ప్రోటీన్లు, విటమిన్- ఏ ఉండే ఆహార పదార్థాలు ఎక్కువగా ఉండేటట్లు చూసుకోవాలి.
- విద్యార్థులు ఉదయాన్నే వ్యాయామం చేయడంతో పాటు కళ్లకు సంబంధించిన ఎక్సర్సైజులు చేయడంతో తగినంత రిలాక్స్‌నెస్ దొరుకుతుంది.
- కన్నులు పొడిబారకుండా ఒత్తిడి తలెత్తకుండా గాలి, వెలుతురు ధారాళంగా వచ్చే స్థానాల్లో కూర్చొని చదవాలి. ముఖ్యంగా ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల గాలి నేరుగా కళ్లపై పడకుండా జాగ్రత్త వహించాలి.
- పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారు సెల్ ఫోన్‌లో పీడీఎఫ్ స్టడీ మెటీరియల్ చదవడం కంటే పెద్ద తెరలు ఉన్న ట్యాబులు, లాప్టాప్లను వినియోగించడం మంచిది.
- కళ్లు పొడిబారడం, తలనొప్పి, దృష్టి మందగించడం, దగ్గర చూపు కనిపించకపోవడం, పార్శ్వపు నొప్పులు ఉన్నట్లయితే చదివే విషయాంశాలపై ఏకాగ్రత తగ్గే ప్రమాదం ఉంటుంది. ఇటువంటి లక్షణాలు ఉంటే తక్షణమే నేత్ర వైద్యులను సంప్రదించి కంటి పరీక్షలు చేయించుకోవాలి.
- కళ్లు ఎర్రబారకుండా తగినంత నిద్రతో పాటు మధ్య మధ్యలో చల్లని నీటితో కళ్లను కడగాలి.
- చదువు ధ్యాసలో పడి తగినంత నీరు తీసుకోకపోతే డిహైడ్రేషన్ జరిగి మైగ్రేన్ పార్శ్వపు తలనొప్పికి దారితీస్తుంది. ఎక్కువ కాంతి కళ్లపై పడకుండా జాగ్రత్త పడాలి.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క



ఆశ్రమ పాఠశాల విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఉట్నూర్‌రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, శిశు సంక్షేమశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలను ఆదివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు గొప్ప లక్ష్యాలను పెట్టుకొని ఆ దిశగా ఉన్నత చదువులు చదువుకోవాలన్నారు. ఈ పోటీ ప్రపంచంలో పురుషులతో సమానంగా మహిళలు సైతం అన్ని రంగాల్లో రాణించాలని పేర్కొన్నారు. ఈ పోటీ ప్రపంచంలో పురుషులతో సమానంగా మహిళలు సైతం అన్ని రంగాల్లో రాణించాలని పేర్కొన్నారు. ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా చదువును మధ్యలో ఆపేయకూడదన్నారు.

ఆశ్రమ విద్యార్థులతో కలిసి...

ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎందా గ్రామంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలను రాష్ట్ర పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వంట గదితో పాటుగా వసతి గదులను, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, చదువులో రాణించాలని సూచించారు. మంత్రి వెంట ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, నాయకులు ఆత్రం సుగుణ తదితరులున్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

భైంసా: బాసర సరస్వతీ ఆలయం పరిధిలో టీటీడీ అతిథిగృహం వద్ద గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు బాసర ఎస్సై గణేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఈ వృద్ధుడు కొంతకాలంగా బాసర ఆలయం వద్ద భిక్షాటన చేస్తుండే వాడని, 65 నుంచి 70 ఏళ్ల వరకు ఉంటాడని, వివరాలు తెలిస్తే 8712659540, 8712577657 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

పురుగుల మందు తాగి వ్యకి ఆత్మహత్య

బోథ్: పురుగుల మందుతాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై రాము వివరాల ప్రకారం... పట్నాపూర్ గ్రామానికి చెందిన మడావి సురేందర్(39) కొన్ని రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. కడుపు నొప్పి తీవ్రతరం కావడంతో రెండు రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని భగత్‌సింగ్ నగర్‌కు చెందిన సలేహ ఫాతిమా (20) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన ఫాతిమాతో భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన సోహెల్ ఖాన్‌తో నాలుగు నెలల కిందట వివాహమైంది. వరకట్నం కింద రూ.లక్ష, రెండు తులాల బంగారంతో పాటు ఇతర సామగ్రి ఇచ్చారు. అదనంగా కట్నం కావాలని కొన్నిరోజుల నుంచి సోహెల్‌ఖాన్‌తో పాటు వారి కుటుంబ సభ్యులు వేధింపులకు గురి చేస్తున్నారు. ఈ నెల 2న మనస్తాపం చెందిన ఆమె పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం రిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నాడు పచ్చదనం.. నేడు వెలవెల





జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో లక్షల రూపాయలు ఖర్చు చేసి 2022 సంవత్సరంలో వర్టికల్ గార్డెన్‌ను ప్రారంభించారు. వాటి నిర్వహణను మాత్రం గాలికి వదిలేశారు. లక్షలు ఖర్చు చేసి ప్రజాధనాన్ని ఇలా వృథా చేయడంపై పర్యావరణ ప్రేమికులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో మార్నింగ్ వాక్ చేసే కాస్త రిలాక్స్ అవ్వడానికి వర్టికల్ గార్డెన్ మెట్లపై కూర్చొని ప్రకృతి పచ్చదనాన్ని ఆస్వాదించడానికి వస్తున్న వాకర్స్ పచ్చదనం లేకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్